

స్థానికానికి సిద్ధం..

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మెదక్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మెదక్ జిల్లాలో తొలివిడతలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, హవేళీఘనపూర్, పాపన్నపేట, పెద్దశంకరంపేట మండలాల్లోని 160 పంచాయతీల్లో 1,402 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట, పటాన్‌చెరు, గుమ్మడిదల, హత్నూర, మొగుడంపల్లి మండలాల్లోని 136 గ్రామాలు, 1246 వార్డుల్లో తొలివిడత కొనసాగనున్నది. ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే ఆర్వో, ఏఆర్వోలకు కలెక్టర్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. జోనల్, మండల అధికారులు, ఎంసీసీ నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను నియమించి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించారు. అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను అధికారులు స్వీకరించనున్నారు.

పాపన్నపేట, టేక్మాల్‌లో పరిశీలించిన మెదక్ కలెక్టర్

పాపన్నపేట, టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ ఏర్పాట్లను బుధవారం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి, గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామ కూడళ్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. అదే విధంగా ఓటరు జాబితాను కూడా ప్రదర్శించాలన్నారు. శనివారం వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుందని తెలిపారు. నామినేషన్లు స్వీకరించడానికి 147 మంది రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. ఒక వ్యక్తి నాలుగు సెట్లు వరకు నామినేషన్ దాఖలు చేయొచ్చని చెప్పారు. నామినేషన్‌లో కచ్చితంగా తేది, సమయం, క్రమ సంఖ్య నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థి సంతకం, ధ్రువీకరణ, ప్రతిపాదకుని సంతకం ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌కు శ్రీశాంత్‌గౌడ్



రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీశాంత్‌గౌడ్‌ను విజేతగా ప్రకటిస్తున్న రెఫరీ (ఫైల్)

సంగారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా హనుమకొండలో ఈ నెల 23న జరిగిన కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో సంగారెడ్డి సోమేశ్వరవాడకు చెందిన శ్రీశాంత్‌గౌడ్ విజేతగా నిలిచాడు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి హర్యానాలో నిర్వహించే జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీశాంత్‌గౌడ్‌ను కోచ్ ఆనంద్ భాస్కర్ బుధవారం అభినందిస్తూ ఇదే ప్రతిభను జాతీయ స్థాయిలో ప్రదర్శించి విజయం సాధించాలని ఆకాంక్షించారు.


పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర విద్యా పరిశీలకుడు



కాళ్లకల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి పరిశీలకుడు శ్రీనివాసరావు

మనోహరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లకల్ జడ్పీ ఉన్నత పాఠశాలను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి పరిశీలకుడు శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పరీక్ష పత్రాలు, పరీక్ష గదులను, ఏటీఎల్ డిజిటల్ లేబరేటరీ పాఠశాల గదులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత వంద శాతం వచ్చే విధంగా చూడాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి వెంకటస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పల్లెల్లో పంచాయతీ పోరు వేడెక్కుతోంది. ఏ గ్రామంలో ఎవరెవరు బరిలో ఉంటున్నారు. వారి బలాబలాలపైనే చర్చ సాగుతోంది. ఇక గెలవడానికి ఎంత ఖర్చు చేయాలి..? ఏ రకంగా ఖర్చు పెట్టాలి..? డబ్బులు వెచ్చిస్తే బయటపడతామా.. లేదా? నమ్మకంగా ఓట్లు వేస్తారా.. మోసం చేస్తారా..? అనే అనుమానాలు ఆశావహుల మెదళ్లను తొలుస్తున్నాయి. అందుకే ఏ మాత్రం టెన్షన్ లేకుండా ఉండేందుకు ఏకగ్రీవ ప్రయత్నాలు మొదలుపెట్టారు. నేటి నుంచే తొలి విడత ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేస్తున్న క్రమంలో పోటీ లేకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నారు.



ఏకగ్రీవ ఎత్తులు

పోటీ లేకుండా చూసుకుంటున్న ఆశావహులు
గ్రామాలకు నజరానా.. పోటీదారులకు కానుకలు
పలుచోట్ల రూ.కోటి వెచ్చించేందుకు సిద్ధం
గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రయత్నాలు



సంగారెడ్డి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 1,663 గ్రామపంచాయతీలు 14,098 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. దాదాపు రెండేళ్ల కాలంగా పల్లెల్లో సర్పంచ్‌లు, వార్డుసభ్యులు లేక పోయారు. దీంతో బరిలో నిలవాలనుకున్న ఆశావహులు రెండేళ్ల నుంచి ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల రణరంగం మొదలైంది. నువ్వా నేనా అంటూ పోటీకి కాలు దువ్వుతున్నారు.

ఇక్కడ హాట్ కేక్..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట మండలాల్లోని పలు గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. రియల్‌ఎస్టేట్ పరంగా అభివృద్ధి చెందాయి. పారిశ్రామికంగానూ ఆదాయం సమకూరుతోంది. దీంతో ఈ గ్రామాల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు రూ.కోటి ఖర్చు చేసేందుకైనా సిద్ధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏకగ్రీవం చేసినా గ్రామానికి రూ.కోటికి పైగానే వ్యక్తిగతంగా నజరానా ఇవ్వడానికి కూడా ముందుకు వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక సిద్దిపేట జిల్లా మర్కుక్, ములుగు, సిద్దిపేట అర్బన్, గజ్వేల్, వర్గల్, కుకునూరుపల్లి, కొమురవెల్లి, జగదేవ్‌పూర్ మండలాలు, మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరబాద్, మాసాయిపేట, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల్లోని పలు ఆదాయ వనరులున్న గ్రామాలపైనా మిగతా 7లో

నేటి నుంచి నామినేషన్లు..

నేటి నుంచి తొలివిడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. 29 వరకు గడువు ఉండగా, 30న నామినేషన్లను పరిశీలిస్తారు. డిసెంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 3న ఉపసంహరణ ఉంటుంది. ఇక డిసెంబరు 11న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ చేపడతారు. తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లోనే ప్రస్తుతం సందడి నెలకొంది. అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేయాలా.. నిరాడంబరంగా వేసి వచ్చేయాలా అని ఆశావహులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కాగా రెండు, మూడు విడతలు నిర్వహించే గ్రామాల్లో పోటీదారులు ఖర్చుకు భయపడి ఇంకా తెరమీదకు రాలేదు.



ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్



నామినేషన్ వేస్తున్నారా..?

కావాల్సిన పత్రాలు, తెలుసుకోవాల్సిన నిబంధనలు ఇవే..
ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించాలి 7

సర్పంచ్ నుంచి పీఏసీ చైర్మన్ వరకు..

దివంగత ఎమ్మెల్యే పి.కిష్టారెడ్డి ప్రస్థానం 7

ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. బుధవారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అధికారులు సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌వోలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల దూరంలో మార్క్ చేయించాలని, ప్రతీ అంశం వీడియో రికార్డింగ్ చేయించాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ రఘునందన్‌రావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్‌బీ సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఎన్నికల విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, సదా నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఆర్ పరిహారం.. తొలివిడతతోనే

సరిపెడతారా?

సందిగ్ధంలో భూములిచ్చిన రైతులు
కలెక్టర్ నిర్ణయంపైనే రైతుల ఆశలు
ఎకరాకు రూ. 40 లక్షల హామీ ఏమైంది?
ఇంకా 9 గ్రామాల రైతులకు తొలివిడత పరిహారం అందేదెప్పుడు?

నర్సాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రీజనల్ రింగ్‌రోడ్డు (త్రిబుల్ ఆర్) నిర్మాణానికి భూములిచ్చిన రైతులు ప్రస్తుతం పరిహారంపై సందిగ్ధంలో ఉన్నారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో మొత్తం 13 గ్రామాల నుంచి 758 ఎకరాలను రైతులు అప్పగించారు. భూమి తీసుకునే సమయంలో ఎకరాకు మార్కెట్ ధరకు మూడింతలు కలిపి సుమారు రూ.40 లక్షలకుపైగా పరిహారం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే, ఎట్టకేలకు ఖాతాల్లో జమవుతున్న తొలి విడత పరిహారం కేవలం ఎకరాకు 14 లక్షల నుంచి 16 లక్షల మేర మాత్రమే ఉంది.

నాలుగు గ్రామాలకు తొలి విడత

డివిజన్‌లో మొదటగా నాలుగు గ్రామాలైన నాగులపల్లి, తిర్మలాపూర్, గుండ్లపల్లి, పాంబండకు చెందిన రైతులకు తొలి విడత పరిహారం వారి ఖాతాల్లో జమ అయింది. నాగులపల్లిలో 26 మంది రైతులకు రూ.61.18 లక్షలు, తిర్మలాపూర్‌లో 9 మంది రైతులకు రూ.20.51 లక్షలు, గుండ్లపల్లిలో 12 మంది రైతులకు రూ.2.77 కోట్లు, పాంబండలో ముగ్గురు రైతులకు రూ.15.85 లక్షల చొప్పున మంజూరైంది.



రెండో విడతపై కలెక్టర్ నిర్ణయమే కీలకం

తొలి విడత పరిహారం అందుకున్న మిగతా 8వ పేజీలో

రెడ్డిపల్లి రైతుల అభ్యంతరం.. కవిత లేఖ

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి రైతులు మాత్రం భూములు ఇవ్వడానికి అభ్యంతరం తెలుపుతూ అధికారులు అందించిన నోటీసులను కూడా తీసుకోలేదు. తమ గ్రామ పరిధిలోనే త్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ కావాలని మార్చారని, పెద్దల కోసం తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాళేశ్వరం కాలువ కోసం భూములు ఇచ్చామని, మళ్లీ ఆర్‌ఆర్‌ఆర్ కోసం ఇస్తే తమ బతుకుతెరువు ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ మొత్తం రింగులా ఉండగా, రెడ్డిపల్లి సమీపంలోనే వంకర తిరిగిందని, పెద్దల భూములు పోకుండా ఉండేందుకు అలైన్‌మెంట్ మార్చారనేది రెడ్డిపల్లి రైతుల ప్రధాన ఆరోపణ. ఈ విషయాన్ని ఇటీవల రెడ్డిపల్లిలో పర్యటించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దృష్టికి రైతులు తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆమె స్పందించారు. రెడ్డిపల్లి సమీపంలో రింగ్‌రోడ్డు ఎందుకు వంకర తిరగాల్సి వచ్చిందో దానిపై సమగ్ర విచారణ చేయాలని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భూములు తీసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాశారు. ఈ లేఖ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



కవిత రాసిన లేఖ

తవ్వేశారు.. వదిలేశారు

● సంగారెడ్డిలో నిలిచిన బైపాస్ రోడ్డు విస్తరణ
● హెచ్‌ఎండీఏ నిర్లక్ష్యమా, ఇతర శాఖల అలసత్వమా?
● విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపునకే రూ.61 లక్షలు చెల్లించినా కదలిక కరవు

సంగారెడ్డి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు విస్తరణ పనులు దాదాపు రెండు నెలలుగా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్‌ఎండీఏ పర్యవేక్షణలో చేపట్టిన ఈ పనులు విద్యుత్, అటవీ శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ముందుకు సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.12 కోట్లతో విస్తరణ ప్రాజెక్టు

జిల్లా కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి 161వ నంబర్ జాతీయ రహదారి వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఏడాది క్రితం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కింద రూ.12 కోట్లు మంజూరయ్యాయి. ఈ విస్తరణలో భాగంగా జిల్లా జడ్జి నివాసం, సాయిబాబా కమాన్, పాత డీఆర్‌డీఏ(వెలుగు) కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (వసంత నగర్ కాలనీ) వద్ద చౌరస్తా కూడళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



రోడ్డు విస్తరణ కోసం తవ్వేసి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన బైపాస్ రోడ్డు

రోడ్డుకిరువైపులా తవ్వకం

కాంట్రాక్టర్ మొదట్లో పనులను చురుకుగా ప్రారంభించినా, ప్రస్తుతం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెండున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణ కోసం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు తారు రోడ్డు నిర్మాణానికి రోడ్డుకిరువైపులా తవ్వకాలు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. జిల్లా న్యాయాధికారి నివాసం నుంచి బసవేశ్వర విగ్రహం వరకు రోడ్డు తవ్వేసి, తారు రోడ్డు వేయకుండా వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు మిగతా 8వ పేజీలో

ఆగిపోయిన అమృత్ 2.0

నర్సాపూర్‌లో అసంపూర్తి దశలోనే రెండు ట్యాంక్ నిర్మాణ పనులు
12 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు ఇంకెప్పుడు మొదలవుతాయో? 7

చలికాలం చేయాలి.. వ్యాయామం

7

రాజ్యాంగ హక్కులను గౌరవించాలి

● సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సంగారెడ్డి, మెదక్ కలెక్టర్‌లు ప్రావీణ్య రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కళాశాలలో, మెదక్ కలెక్టరేట్‌లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రాముఖ్యాన్ని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర ఆధ్వర్యంలో దినోత్సవాన్ని నిర్వహించారు.




సంగారెడ్డిలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు, మెదక్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు



మాక్ అసెంబ్లీ

మనోహరాబాద్ మండలం కూచారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలబాలికలతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు.
- మనోహరాబాద్

ఒకే ఈతలో రెండు దూడలు


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆవులు సాధారణంగా ఒక ఈతలో ఒక దూడకే జన్మనిస్తాయి. నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామానికి చెందిన రైతు శశికాంత్‌కు చెందిన ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు జన్మించడం అరుదుగా జరుగుతుంది. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది దూడలను పరీక్షించారు. ఆవుతో పాటు దూడలు ఆరోగ్యంగా ఉన్నా ప్రత్యేక సంరక్షణ అవసరమని యజమానికి సూచించారు. అలాగే జన్యువు కారణంగా ఒకే ఈతలో రెండు దూడలు అరుదుగా పుడతాయని చెప్పారు. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు దూడలను ఆసక్తిగా తిలకించారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల నుంచి జహీరాబాద్‌లోని అల్లానా కర్మాగారానికి వాహనాలపై పశువులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగో అధ్యక్షుడు రాములు నేత కోరారు. బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు మానవత్వం మరిచిపోయి పశువులను ఇరుకు వాహనాల్లో నింపి అల్లానా పశువధ శాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురిపై కేసు


గంగెల్ల పవన్‌కల్యాణ్ (ఫైల్)

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతి దక్కడం లేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో.. గౌరారం పోలీసులు యువతి తరఫు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన గంగెల్ల పవన్‌కల్యాణ్(21) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరిది వేర్వేరు కులాలు కావడంతో పెద్దలు వీరి ప్రేమకు అడ్డుచెప్పారు. సంవత్సరం క్రితం ఇరు కుటుంబాల మధ్య గొడవల జరిగాయి. ఇద్దరూ దూరంగా ఉండాలని ఆంక్షలు విధించారు. ఇటీవల యువతి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో పెళ్లి కుదిర్చారు. ఆ పెళ్లి ఇష్టం లేని యువతి పవన్‌కల్యాణ్‌కు ఫోన్‌చేసి ఇద్దరం పారిపోయి పెళ్లి చేసుకుందాం.. లేదంటే ఇద్దరం ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. దీంతో ఈ నెల 18న రాత్రి 10 గంటలకు పవన్‌కల్యాణ్ యువతి ఇంటికి వెళ్లాడు. ఇంతలో యువతి తండ్రి చీర్ల శ్రీనివాస్, బాబాయ్ చీర్ల మహేష్, యువతి మామ వనం తిరుపతి వచ్చి పవన్‌కల్యాణ్‌ను తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక పవన్‌కల్యాణ్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం క్షీణించడంతో ఈనెల 23న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ 25న మృతిచెందాడు. మృతుడి తండ్రి గంగెల్ల యాదగిరి ఈ నెల 22న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కల్యాణ్ వాంగూల్మాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేశారు. పవన్‌కల్యాణ్ మృతిచెందిన తర్వాత దాడిచేసిన చీర్ల శ్రీనివాస్, వనం తిరుపతి, చీర్ల మహేష్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ప్రహరీ లేని పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం

ప్రహరీ లేక పరేషాన్

- అధ్వానంగా పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ
- ప్రహరీ నిర్మించాలని మంత్రిని, కలెక్టర్‌ను కోరినా నిరాశే

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 147 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల పశువులు, విషసర్పాలు వస్తున్నాయి. సెలవు దినాల్లో ఆకతాయిలు పాఠశాలలోకి వచ్చి కిటికీలు, తాగునీటి పైపులు, నల్లాలు, ఇతర సామగ్రిలను ధ్వంసం చేస్తున్నారు. అలాగే మందుబాబులు సైతం రాత్రివేళల్లో పాఠశాలలో సిట్టింగ్‌లు చేస్తున్నారు. ఏప్రిల్ 19న వాటర్‌షెడ్ యాత్రకు గ్రామానికి వచ్చిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు పాఠశాల ప్రహరీ సమస్యపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి తక్షణమే పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినా.. నేటివరకూ పాఠశాలకు ప్రహరీ నిర్మించలేదు. కలెక్టర్ స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐక్య ఉద్యమాలతో మోదీకి బుద్ధి చెబుదాం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడిదారుల కోసమే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, కార్మికవర్గం ఏకమై మోదీకి బుద్ధి చెబుదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహం వరకు సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే దశ స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వావలంబనను తాకట్టు పెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

●సంగారెడ్డి రూరల్: నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ బుధవారం సంగారెడ్డిలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, లక్ష్మయ్య, రాజారాం, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్ : ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. కార్మిక రంగాన్ని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకే లేబర్ కోడ్‌లను తెచ్చారని ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ తెలిపారు. కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్మిక సంఘం బాధ్యులు చంద్రకళ, రాజు,ఏసు, నాగయ్య, సిద్దమ్మ, నిర్మల, నర్సమ్మ పాల్గొన్నారు.

సొసైటీ సమావేశం జరపరా..?

- ఐదేళ్లుగా జరగని పాలకవర్గ సమావేశం
- చర్యలకు ఇన్‌చార్జి డీసీవోకు రైతుల ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న రైతులు

నిజాంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సహకార పరపతి సంఘంలో అర్థ సంవత్సర సమావేశం ఏర్పాటు చేయడం లేదంటూ రైతులు బుధవారం ఫిర్యాదు చేశారు. అందువల్ల సహకారశాఖ చట్ట ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి జిల్లా అధికారి శంకర్‌ను కోరారు. ఐదేళ్ల నుంచి ఒక్కసారి కూడా జనరల్ బాడీ మీటింగ్ లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనివల్ల సొసైటీలో లావాదేవీలపై రైతులకు తెలియటం లేదన్నారు. అదేవిధంగా సొసైటీలో లావాదేవీలు లేక దీర్ఘకాలిక మొండిబకాయిగా పరిగణించారని, దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లుతున్నదని తెలిపారు. రైతులకు తెలియకుండా రైతు ఖాతాల్లో ఎక్కువ ఉన్నట్టుగా చూపించినందున రుణమాఫీ కాక ఎంతోమంది రైతుల నష్టపోయారని, తక్షణమే స్పందించి కార్యవర్గాన్ని రద్దు చేసి, రైతులకు న్యాయం చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శనిగపల్లి రాజం, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రైతులు గాండ్ల విట్టల్, సుధాకర్, శ్రీశైలం, బాగాగౌడ్, స్వామి, ఎల్లం తదితరులు ఉన్నారు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

- నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ హెచ్.వాగిషన్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాగిషన్

హుస్నాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉన్నదని నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ హెచ్.వాగిషన్ అన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 'భారత రాజ్యాంగం-విశిష్టత' అనే అంశంపై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే గొప్ప రాజ్యాంగమని, దీనిని కొంతమంది మతవాదులు, రాజ్యాంగ వ్యతిరేకులు ప్రజాస్వామ్యాన్ని నిర్మూలించే విధానాన్ని పని కట్టుకొని చేస్తున్నాయన్నారు. వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. దీనికి ముందు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సదస్సులో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఫోన్‌లో మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి విద్యార్థి అధ్యాయనం చేయాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిత్తారి రవీందర్, డ్యాగల సారయ్య, ఓయూ జేఏసీ నాయకులు గంపల శ్రీనివాస్, చెప్యాల ప్రకాష్, శంకర్, నాంపల్లి సమ్మయ్య, కవి రచయిత వడ్డెపల్లి మల్లేశం, ముక్కెర సంపత్ తదితరులున్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, తెలంగాణ అంబేడ్కర్ సంఘం, పట్టణ బీజేపీశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


ఉమెరుద్దీన్(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వెల్దుర్తికి చెందిన మహ్మద్ ఉమెరుద్దీన్(16) సంగారెడ్డిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు.



నామినేషన్ వేస్తున్నారా..?

● కావాల్సిన పత్రాలు, తెలుసుకోవాల్సిన నిబంధనలు



హుస్నాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులకు కావాల్సిన పత్రాలు, నిబంధనలు..

● గ్రామపంచాయతీ వార్డుసభ్యుడిగా, సర్పంచ్‌గా పోటీచేసే అభ్యర్థులు ఆ గ్రామ ఓటరు జాబితాలో వారి పేరు ఉండాలి

● సర్పంచ్‌కు పోటీచేసే అభ్యర్థికి ఓటరు ప్రతిపాదకునిగా ఉండాలి

- వార్డుసభ్యుడిగా పోటీచేసే అభ్యర్థికి ఓటరు ప్రతిపాదకునిగా ఉండాలి

● అభ్యర్థి ఫొటో, కుల, బర్త్ సర్టిఫికెట్, నో డ్యూస్ సర్టిఫికెట్, ఇద్దరు సాక్షులు, అభ్యర్థి సంతకంతో కూడిన రూ.50 అఫిడవిట్‌ను నామినేషన్ పేపరుతో పాటు అందించాలి.

● నామినేషన్ డిపాజిట్ అమౌంట్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1000, జనరల్‌కు రూ.2000, వార్డుసభ్యుడికి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.250, జనరల్‌కు రూ.500

● ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించడానికి వీలుగా ఖర్చు నిమిత్తం ప్రతి అభ్యర్థి ఒక ప్రత్యేకమైన బ్యాంకు ఖాతాను ప్రారంభించాలి. అభ్యర్థి తన నామినేషన్ దాఖలు చేయడానికి కనీసం ఒకరోజు ముందు ఈ ఖాతాను ప్రారంభించాలి. ఈ బ్యాంకు ఖాతా నుంచే అభ్యర్థి తన మొత్తం ఎన్నికల వ్యయాన్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది.

● సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ సెట్లు ఎన్ని వేసినా ఒకే డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వార్డుసభ్యులు ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో నామినేషన్లు వేసినా ఒక వార్డుకు మించి పోటీ చేయరాదు.

సర్పంచ్ నుంచి పీఏసీ చైర్మన్ వరకు..

● దివంగత ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి ప్రస్థానం


పట్లోళ్ల కిష్టారెడ్డి (ఫైల్)

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ స్థాయి నుంచి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే, దివంగత పట్లోళ్ల కిష్టారెడ్డి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ వరకు ఎన్నికయ్యారు. 1942 అక్టోబరు 2న నారాయణఖేడ్ మండలం పంచగామలో జన్మించిన కిష్టారెడ్డి న్యాయశాస్త్రంలో పట్టా పొంది 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. 1970లో కాంగ్రెస్‌లో చేరి, పంచగామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచగామ గ్రామపంచాయతీ పరిధిలో అప్పట్లో పగిడిపల్లి, రుద్రార్, జగన్నాథ్‌పూర్, బాణాపూర్, జూజాల్‌పూర్, పిప్రి గ్రామాలు ఉండేవి. అనంతరం సూపర్ బజార్ చైర్మన్‌గాను పని చేసి, ప్రభుత్వ న్యాయవాదిగాను సేవలందించి, 1989, 1999, 2009, 2014లలో నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన టీడీటీ బోర్డు సభ్యుడిగా రెండుసార్లు పీఏసీ చైర్మన్‌గా పనిచేశారు. సర్పంచ్ స్థాయి నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, పీఏసీ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ప్రస్తుతం ఆయన కుమారుడు సంజీవరెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నాడు.

ఏకగ్రీవ ఎత్తులు

(5వ పేజీ తరువాయి)

ఆశావహులు నజర్ పెట్టారు. ఏకగ్రీవం చేసుకుంటే పెట్టిన పెట్టుబడికి సేఫ్‌జోన్‌లో ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ దిశగా చర్చలు సైతం నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లోనూ స్థలాలు, డబ్బులు నజరానాగా ఇచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు.

భూములు, నగలు తాకట్టుపెట్టి..

అనూహ్యంగా ఎన్నికలు తెరమీదకు రావడంతో ఆశావహులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నామినేషన్, ఇతర ప్రచార ఖర్చుల కోసం భార్య నగలు తాకట్టు పెడుతున్నానని ఓ నాయకుడు 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి' దృష్టికి తెచ్చాడు. తన వ్యవసాయ భూమి అమ్మకానికి పెట్టానని, ఒకవేళ సరైన ధర రాకుంటే ఎవరికైనా తాకట్టుపెట్టి వడ్డీ చెల్లిస్తానని చెప్పుకొచ్చాడు. ఇది ఒక్కరి పరిస్థితే కాదు. ప్రస్తుతం రియల్‌ఎస్టేట్ రంగం కుదేలు కావడంతో చాలామంది వద్ద డబ్బులు కరువయ్యాయి. కొనుగోలు చేసిన భూములు, స్థలాలను నమ్ముకొనే పోటీకి సిద్ధపడుతున్నారు. సర్పంచ్‌గా గెలిస్తే పలుకుబడితోపాటు ఆర్థికంగానూ బాగుపడతామనే ఆలోచనతో అప్పులు చేస్తున్నారు.


కోహిర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


భానూరు పంచాయతీ కార్యాలయం

మూడు గ్రామాల మండలం పటాన్‌చెరు

పటాన్‌చెరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో జిల్లాలో అతి చిన్న మండలంగా పటాన్‌చెరు మిగిలిపోయింది. కేవలం మూడు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. భానూరు 7,084, నందిగామ 3,564, క్యాసారం 2,350 ఓటర్లతో గ్రామాల్లో ఎన్నికలు జరుపుతున్నారు. గతంలో 28 గ్రామాలుండగా అమీన్‌పూర్ మండలంగా విడగొట్టగా 19 గ్రామాలు మిగిలాయి. ఇస్నాపూర్‌ను మున్సిపల్‌గా చేసినప్పుడు 11 మిగిలాయి. ఇప్పుడు ఇంద్రేశం పురపాలక సంఘం ఏర్పాటైంది. చివరకు మూడు గ్రామాలతో జిల్లాలో అతి చిన్న మండలంగా పటాన్‌చెరు మిగిలిపోయింది.

ఉపాధ్యాయ ఉద్యోగం వదిలి..


ముత్యాల కిష్టయ్య

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ముత్యాల కిష్టయ్య(87) నారాయణఖేడ్ మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1938లో జన్మించిన కిష్టయ్య డిగ్రీ వరకు చదివి ఉపాధ్యాయుడిగా చేరి, అప్పటి దివంగత ఎమ్మెల్యే వెంకటరెడ్డికి అనుచరుడిగా కొనసాగారు. 1995లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 18 నెలల పదవీకాలం ఉన్నప్పటికీ, ఉద్యోగానికి రాజీనామా చేసి, సర్పంచ్‌గా పోటీచేసి 97 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో సైతం నియోజకవర్గ జేఏసీ కన్వీనర్‌గా పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా ముత్యాల కిష్టయ్య మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా రూ.5 లక్షల లోటుతో బాధ్యతలు చేపట్టి, రూ.3 లక్షల మిగులు బడ్జెట్‌తో బాధ్యతలు అప్పగించామని, అప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు పోలిక లేదన్నారు.

ఆగిపోయిన అమృత్ 2.0


మధ్యలోనే ఆగిపోయిన పనులు

నర్సాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో శాశ్వత నీటి పరిష్కారం కోసం రూ.12 కోట్లతో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 పనులను అసంపూర్తి దశలోనే నిలిచిపోయాయి. పట్టణంలో రెండు ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. నర్సాపూర్-మెదక్ మార్గంలో మూతపడ్డ చెరకు ఫ్యాక్టరీ వెనకభాగంలో కేటాయించిన స్థలంలోని ట్యాంకు నిర్మాణం పనులు మొన్నటివరకు చకచకా సాగి కొన్నిరోజుల నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. 750కెఎల్ నిల్వ సామర్థ్యం గల ఈ భారీ ట్యాంకు నిర్మాణం చివరిదశకు వచ్చాక నిలిచిపోవడం విశేషం. నర్సాపూర్-కాగజ్‌మద్దూర్ మార్గంలో 600కెఎల్ సామర్థ్యంతో మరో ట్యాంకు నిర్మాణం చేపట్టాలని స్థలం కేటాయించారు. అది వివాదాస్పదంగా మారింది. కొందరు తమ స్థలమంటూ అభ్యంతరం తెలపడంతో ఆ పనులు అసలే మొదలుకాలేదు. ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణంలో 15 వార్డుల్లో 12 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉంటుంది. ట్యాంకుల నిర్మాణమే సాఫీగా సాగకపోవడంతో పైపులైన్ పనులు ఇక ఎప్పుడు మొదలుపెడుతారో అన్న అనుమానం వ్యక్తమవుతోంది. పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ప్రస్తుతం భగీరథ నీరు సరఫరా కావడం లేదు. మంజీర, బోర్ల నీటి నిల్వ సరిపడా ట్యాంకులు లేక సమస్యలు తలెత్తుతున్నాయి. అమృత్ 2.0 పథకం ద్వారా చేపట్టిన పనులు పూర్తయితే పట్టణంలో శాశ్వతంగా నీటి సమస్య తీరుతుందని ఆశిస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని కోరుతున్నారు.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి హుండీ లెక్కింపు

● సమకూరిన రూ.29 లక్షల ఆదాయం


హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు, భక్తులు, భ్రమరాంభికా సేవాసమితి సభ్యులు

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయరామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లెక్కింపుకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగింది. నాచగిరి క్షేత్రం 154 రోజులకు (26-6-2025 నుంచి 26-11-2025)వరకు లెక్కింపు నిర్వహించగా రూ.29,62,845 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే మిశ్రమ బంగారం 61 గ్రాములు, కిలో 337 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చంద నాగరాజు, గాలి కిష్టయ్య, ఉష్ణశ్రీ రాజశేఖర్ శర్మ, కర్రె పద్మావెంకటేశ్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, నాయకం శ్రీనివాస్, రుద్రశ్రీ హరి, కొత్తపల్లి శ్రీనివాస్, ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండుతో పాటు భ్రమరాంభికా సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవుసుల కుంట కట్ట పోశారు


అవుసుల కుంటను మళ్లీ పోసిన అధికారులు

తూప్రాన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని అవుసుల కుంటను ఇరిగేషన్ అధికారులు యధావిధిగా పోశారు కొందరు. కంటను తొలగించి రోడ్డు వేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పత్రికల్లో వార్తలు రావడంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేశారు. బుధవారం ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించిన మట్టిని పోసి అవుసుల కుంట కట్టను యధావిధిగా పోశారు. కొందరు కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

● వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం


సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

కొండపాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంతాన మల్లికార్జునస్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వస్తి వాచనం, కలశస్థాపన, నవగ్రహ దిక్పాలక స్థాపన, స్థాపిత దేవతాపూజ నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామికి, ఉత్సవమూర్తులకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల మధ్య కల్యాణం జరిగింది. మోహన్‌కృష్ణశర్మ, వేదవ్యాస్ లక్ష్మణరావు తదితరులు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు చీకోటి మల్లికార్జున్, నర్సింహారెడ్డి, గట్టు విఠల్, అయితా బాలరాజేశం, మర్యాల రవీందర్, మర్యాల వీరేశం, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి విద్యార్థులు

కొండపాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని రుచితకు ఆహ్వానం వచ్చింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 30 ఆదివారం అంతర్జాలంలో ప్రతిష్ఠాత్మకంగా 13 గంటలపాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో టి.రుచిత పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు డా.బీ. సుధాకర్, రఘురాం తెలిపారు. వచన కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులు 101 మంది పాల్గొంటారు. ఈ చిన్నారి వచన కవిత విభాగంలో ఎంపికైందని, మూడు నిమిషాలపాటు కవిత వినిపిస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్, సమన్వయకర్త శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

● తొగుట: ఉత్తర అమెరికా తెలుగు సంఘ ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి తొగుట ప్రభుత్వ పాఠశాల చెందిన విద్యార్థులు విష్ణువర్ధన్, రేఖ, శ్రీనివాస్, జస్వంత్, ఓంకార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.


సమ్మేళనంలో పాల్గొననున్న తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

● చిన్నకోడూరు : చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.విశ్వతేజ, బి.రవితేజ యని అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి బుధవారం తెలిపారు.

వెనకబడిన వర్గాల్లో చైతన్యం నింపిన కవి అందెశ్రీ

● కవి బెల్లంకొండ సంపత్‌కుమార్


గజ్వేల్‌లో నిర్వహించిన సంస్మరణ సభలో మాట్లాడుతున్న కవి బెల్లంకొండ సంపత్‌కుమార్

గజ్వేల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల్లో చైతన్యం నింపిన కవి అందెశ్రీ అని కవి బెల్లంకొండ సంపత్‌కుమార్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జోన్ కన్వీనర్ జిల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవి అందెశ్రీ, ఏపీటీఎఫ్ నిర్మాణ బాధ్యులు కే.నారాయణ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాహిత్య ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమ పోరాటంలో కవిగా అందెశ్రీ పాత్ర మరువలేనిదన్నారు. అందెశ్రీ సమాజంలో వెనుకబడిన వర్గాలను చైతన్యవంతులుగా చేయుటకు, తెలంగాణలో ప్రతి పల్లెకు ఆయన పాట చేరిందన్నారు. నారాయణ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయులకు ఎంతగానో సేవచేశారని, అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం ఎంతో లోటన్నారు. ఆయనవెంట కవి కందుకూరి శ్రీరాములు, ఉపాధ్యాయ దర్శిని మాజీ సంపాదకులు ప్రకాశ్‌రావు, టీపీటీఎఫ్ కార్యదర్శి రాజయ్య, పూర్వ అధ్యక్షుడు ఏడెల్లి రాంచంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, మంజుల, అక్కారం సత్తయ్య, పర్వతం నరసయ్య, తాళ్ల నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, విద్యాసాగర్, వెంకట్, రాజనర్సింహ, పోచం, రాములు ఉన్నారు.

బెల్టుషాపులపై మెరుపుదాడి

హవేళిఘణపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూర్గుపల్లిలో బెల్టు షాపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ షాపులో 16 లీటర్ల మద్యం, ఇలిటెం రాములు షాపులో 21 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.19 వేలు ఉంటుందని, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.


కోహీర్‌లో ఉదయం పూట వ్యాయామం చేస్తున్న యువకులు

చలికాలం.. చేయాలి వ్యాయామం

● ఆరోగ్యానికి ఉపయోగకరం
● మార్నింగ్ వాక్‌తో చురుకుదనం

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో ఉదయం వేళ ఆలస్యంగా నిద్రలేస్తూ.. చాలా మంది వ్యాయామాన్ని పాటించరు. ఏ కాలంలోనైనా తగిన శారీరక శ్రమ ఉంటే బద్ధకం తగ్గి ఒంట్లో చురుకుదనం పెరుగుతుంది. ఎముకలు పటిష్ఠతకు వ్యాయామం అవసరం. చలికాలంలో బిగుసుకుపోయే కీళ్లు మామూలుగా తయారవ్వాలంటే ప్రతిరోజు వ్యాయామం చేయాలి. ఎక్కువ గంటలపాటు కదలకుండా కూర్చుని ఉద్యోగం చేసే వాళ్లు ప్రతి గంటకోసారి లేచి ఐదు నిమిషాల పాటు నడవాలి. వ్యాయామంలో వెయిట్ ట్రైనింగ్ కూడా చేయాలి. చర్మానికి తగినంతగా సూర్యరశ్మి అందితే ఎముకలకు మేలు జరుగుతుంది. అంతేకాకుండా ఎముకలకు శక్తినిచ్చే విటమిన్ కలిగిన పదార్థాలను తీసుకోవాలి. చలికాలంలో చేతులు, పాదాలు మెడ, మోకాళ్లు, కీళ్లు బిగుసుకుపోయి.. కదిలిస్తే శబ్దాలు చేస్తూ ఉంటాయి. అలాంటప్పుడు కాల్షియంతో పాటు విటమిన్-డి తీసుకోవడం ఎంతో అవసరం. ఆహారం ద్వారా శరీరంలోకి చేరే కాల్షియం పూర్తిగా శోషించుకోవాలంటే విటమిన్-డి కావాలి. కాబట్టి చలికి భయపడి పండుకోకుండా నీరెండలో కొద్దిసేపైనా తిరగాలి. అలాగే విటమిన్-డి ఉండే పాలు, గుడ్లు చేపలు తరుచుగా తినాలి.

చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చలిగాలికి జడిసి స్నానం మానేయడం అనారోగ్యానికి కారణవుతుంది. రెండు పూటలా స్నానం చేయడం, తగినన్ని మంచినీళ్లు తాగడం చలికాలంలోనూ అవసరమే.. రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు, వంటి చిరుధాన్యాలు వినియోగంతో శరీరానికి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, జింకు, భాస్వరం, ప్రోటీన్లు, పీచు, కొవ్వు పదార్థాలు, లవణాలు తగినంతగా అందుతాయి. వీటి వాడకం రాను రాను గణనీయంగా తగ్గడంతో ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిరుధాన్యాలను విరివిగా తీసుకుంటే మధుమేహం, రక్తహీనత, నేత్రవ్యాధులు, మలబద్ధకం, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత, రుతుస్రావ సమస్యలు, అధిక రక్తపోటు, అల్సర్లు, కిడ్నీలో రాళ్లు, జీర్ణక్రియ, ఎముకల పట్టుత్వం, రోగనిరోధక శక్తి వృద్ధి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరణకు ఎంతో మేలు జరుగుతుంది.


వ్యాయామం చేస్తున్న యువకులు

వాకింగ్‌తో ఆరోగ్యానికి మేలు



చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల శరీరం చురుకుదనంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వాకింగ్ వెళ్తాం. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

- ప్రేమ్‌రాజ్, బిలాల్‌పూర్

చలికాలంలో వ్యాయామం అవసరం



చలికాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ఎంతో అవసరం శీతాకాలంలో తీవ్రమైన చలి ఉండడం వల్ల శరీరంలోని అవయవాలు బిగుసుకుపోవడమే కాకుండా అనేక రకాలైన నొప్పులు, రోగాలు వస్తాయి. వీటిని నివారించేందుకు వ్యాయామం చేయడం ఉత్తమం.

- అబ్దుల్ ముజీబ్, వ్యాయామ ఉపాధ్యాయుడు

డీ-విటమిన్ ఉన్న పదార్థాలు తీసుకోవాలి




చలికాలంలో ఎముకల ప్రతిష్ఠతకు డీ-విటమిన్ గల పదార్థాలు అవసరం. ఉదయం వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత తప్పనిసరిగా పాలు, గుడ్లు తీసుకోవాలి. చలికాలంలో ఉదయం పూట లేచి వ్యాయామం చేస్తే శరీరంలో రక్తం పల్చబడిన రక్త ప్రసరణ కూడా బాగా జరుగుతుంది.

- నవీన్‌కుమార్, దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు



సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ రఘునందన్‌రావు



సంగారెడ్డి జిల్లా కోర్టులో సంవిధాన్ ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర



మెదక్ కలెక్టరేట్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఘనంగా రాజ్యాంగ అమలు దినోత్సవం



తూప్రాన్ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చేగుంట పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా విద్యాధికారి విజయ, ఎంఈవో నీరజ





కంది మండలంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, రామచంద్రాపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

76వ భారత రాజ్యాంగం అమలు దినోత్సవాన్ని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లు, కోర్టులు తదితర కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు భారత రాజ్యాంగ విశిష్టత, రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. తూప్రాన్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. చేగుంట పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగం రచించిన మహనీయుల ఫొటోలను సేకరించి గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లలో వివిధ సంఘాల వారి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)

మెరుగైన రవాణా సౌకర్యంతోనే గ్రామాలు అభివృద్ధి



అమీన్‌పూర్: వడక్‌పల్లి శివారులో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్/రామచంద్రాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మెరుగైన రవాణా సౌకర్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అమీన్‌పూర్ మండల పరిధిలోని వడక్‌పల్లి గ్రామ శివారులో వాగుపై రూ.2.45కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జికి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తన హయాంలో నియోజకవర్గ కేంద్రానికి అనుసంధానంగా హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయడంతో అనేక గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడి నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. అనంతరం బొమ్మన్‌కుంటలో రూ.15లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, రూ.10లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, డీఈ వెంకటరమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రాపురంలోని భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో రూ.98లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు సింధూఆదర్శరెడ్డి, పుష్పానగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, పరమేష్ యాదవ్, ఐలేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

నర్సాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం వేదమంత్రాల మధ్య అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు మురళీధర్‌యాదవ్, అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌తో పాటు అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కలిసి భక్తులకు భోజనం వడ్డించడమే కాకుండా ఒకే చోట కూర్చుని భోంచేశారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి



సంగారెడ్డి దీక్షా దివస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించే దీక్షాదివస్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీస్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం దీక్షా దివస్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నారాయణఖేడ్, అందోల్ మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మల్లాగౌడ్, చక్రపాణి, నర్సింలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తా



రామాయంపేట సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రామాయంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట సొసైటీ చైర్మన్‌గా తిరిగి పదవి రావడం సంతోషంగా ఉందని బాదే చంద్రం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లాలోని సొసైటీల పదవీకాలం పొడిగింపులో రామాయంపేటను చేర్చలేదు. దీంతో చైర్మన్ నేతృత్వంలో ఆరుగురు డైరెక్టర్లు హైకోర్టుకు వెళ్లి పదవి సాధించారు.ఈ మేరకు బుధవారం స్థానిక సహకార సంఘం పరపతి కార్యాలయంలో బాదె చంద్రంకు ఘన సన్మానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల రుణాలపై తన వంతుగా సహకరిస్తానన్నారు.

గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా బలరాం

నర్సాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని అల్లూరి సీతరామరాజు గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా బలరాం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రాయ్ రీజినల్ కోఆర్డినేటర్‌గా బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లగా, ఆయన స్థానంలో నల్గొండ జిల్లా నుంచి బలరాం బదిలీపై ఇక్కడకు వచ్చారు. బలరాం 2024 సంవత్సరంలో కూడా ఇక్కడ ప్రిన్సిపాల్‌గా కొన్నాళ్లు పనిచేసి మళ్లీ ఇక్కడకే వచ్చారు.

నేటి నుంచి సిర్గాపూర్‌లో మల్లన్న జాతర

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిర్గాపూర్ గ్రామ శివారులో వెలసిన మల్లన్నస్వామి ఆలయ జాతర ఈ నెల 27 నుంచి డిసెంబరు 2వరకు నిర్వహించనున్నట్లు స్థానిక యాదవ సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 30న ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మహిళలందరికీ చీరలు పంపిణీ చేయాలి

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాల వయసు నిండిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని సిర్గాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు, ఉజలంపాడ్ మాజీ సర్పంచ్ శోభవతి శేరికార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో అందరికీ చీరలు అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేడు కేవలం పొదుపు సంఘాల్లో సభ్యులైన వారికే చీరలు పంపిణీ చేయడం సరికాదన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

శివ్వంపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెం తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి ఆయనకు కండువా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మాధవరెడ్డి, సుధీర్ రెడ్డి తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చిన్నశంకరంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆన్ జాబ్ ట్రైనీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలోని సంక్షేమ పథకాల దరఖాస్తులపై విద్యార్థులకు ఎంపీడీవో దామోదర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ పలు సంక్షేమాలు, అధికారుల విధుల నిర్వాహణ తదితర అంశాలపై రెండు నెలల పాటు విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనీ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఒక అంశంపై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

పల్లె పోరు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



పెద్దశంకరంపేటలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్లకు రంగం సిద్ధమైంది. మొదటివిడత ఎన్నికలకు సంబంధించి నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందు కోసం గ్రామాలను క్లస్టర్లవారీగా విభజించి రైతువేదికల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి శనివారం వరకు జరుగుతుంది.

కంది: మండలంలో పంచాయతీ ఎన్నికలకు ఐదు నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కందిలో రైతు వేదికలో కంది, తునికిల తండా, చిమ్నాపూర్, ఉత్తర్‌పల్లి, మక్త అల్లూరు గ్రామాలు. కాశీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కాశీపూర్, చేర్యాల, కలివేముల, చెర్లగూడెం, తోపుకొండ గ్రామాలు, జుల్‌కల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జుల్‌కల్, ఇంద్రకరణ్, ఎద్దుమైలారం గ్రామాలు, కవలంపేట గ్రామపంచాయతీ వద్ద కవలంపేట, మామిడిపల్లి, వడ్డెనగూడా తండా, ఎర్దనూర్, ఎర్దనూర్ తండా గ్రామాలు, చిద్రుప్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, బ్యాతోల్ గ్రామాల కోసం నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కోహీర్: రెండో విడతలో కోహీర్ మండలంలోని క్లస్టర్లవారీగా గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. బిలాల్‌పూర్ రైతు వేదికలో.. మనియార్‌పల్లి, సజ్జాపూర్, బిలాల్‌పూర్, ఖానాపూర్, కొత్తూర్ (కె) గ్రామాలు, గొటిగర్‌పల్లి రైతు వేదికలో.. బడంపేట, పర్శపల్లి, సిద్ధాపూర్, గొటిగర్‌పల్లి గ్రామాలు, పీచేర్యాగడి రైతు వేదికలో... రాజనెల్లి, గురుజువాడ, మద్రి, పీచేర్యాగడి, మాచిరెడ్డిపల్లి, పీచేర్యాగడి తండా గ్రామాలు. దిగ్వాల్ రైతు వేదికలో.. కవెల్లి, చింతలఘట్టు,కొత్తూర్(డి), వెంకటాపూర్, దిగ్వాల్ గ్రామాలు. పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో.. పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఝరాసంగం: మండలంలో ఏడు రైతు వేదిక కస్టర్లను ఏర్పాటు చేసినట్టు ఎంపీఈవో స్వాతి తెలిపారు. ఈ కస్టర్లలో 33 గ్రామ పంచాయితీల సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

పెద్దశంకరంపేట : పెద్ద శంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. ఎంపీడీవో షాకీర్ అలీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. మెదక్ ఆర్డీవో రమాదేవి సైతం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పెద్దశంకరంపేటలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఏడు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు వారు వివరించారు. పెద్దశంకరంపేటలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎన్నికల ఏర్పాట్లను మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు.

రేగోడు: మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ ఏర్పాట్లను మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. కాగా మండలంలోని 18 పంచాయతీలకు గాను నామినేషన్‌కోసం మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సీతారావమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్వో, ఏఆర్‌వోలకు పలు సూచనలు చేశారు.

టేక్మాల్: టేక్మాల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి ఎన్నికల నామినేషన్ల పర్వాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజుద్దీన్, ఆర్ఐ సాయిశ్రీకాంత్ తదితరులు సూచనలు, చేశారు.

హవేళిఘణపూర్: హవేళిఘణపూర్‌లో ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ స్వీకరించే అధికారులకు బుధవారం డివిజినల్ ఎన్నికల అధికారి జయచంద్రారెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటి కప్పుడు దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రేయాంత్, ఎంఈవో మధుమోహన్, ఆర్వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఖేడ్‌లో మౌలిక సదుపాయాలే లక్ష్యం



ఖేడ్ పట్టణం చుట్టు నిర్మిస్తున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపల్ పరిధిలో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని దుర్గమ్మకాలనీ, అనుషమ్మ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. చాంద్‌ఖాన్‌పల్లి నుంచి పట్టణ శివారులోని కంగ్టి రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న పార్మేషన్ రింగు రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ప్రధాన రోడ్ల విస్తరణ, పట్టణం చుట్టు రింగు రోడ్డు, కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాలు తదితర మౌళిక సదుపాయాలకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కేతకి సంగమేశ్వర ఆలయ డైరెక్టర్ ఈశ్వరప్ప, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, మాజీ ఎంపీటీసీలు రామక్రిష్ణ, పండరిరెడ్డి, జ్ఞానేశ్వర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా భారత రాజ్యాంగ 76వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాజ్యాంగ సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, ప్రజా సంఘాల నాయకులు విశ్వనాథ్, రహీం, గణపతి, జీవన్, తుకారం, సాయిలు, వినోద్‌పాటిల్, న్యాయవాది బోజిరెడ్డి, డ్యాని, తాహేర్, తదితరులు ఉన్నారు.


బఫర్‌జోన్‌లో రోడ్డు పనుల అడ్డగింత



అధికారులతో కలిసి రోడ్డు పనులు అడ్డుకుంటున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆకృతిని, ఉనికిని, నాశనం చేయడం మంచి పద్ధతి కాదని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు సాకి చెరువు కట్టకు ఆనుకొని ఇంకార్ రియల్ సంస్థ వారు బఫర్‌జోన్‌లో వేస్తున్న రోడ్డుపనులను అడ్డుకున్నారు. అదేసమయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కొంతసమయానికి వచ్చిన నీటిపారుదలశాఖ ఏఈ ఎండీ గులాం, ఈఈ మల్లేష్‌కు కాల్ చేసి ఫోన్ స్పీకర్ ఆన్‌చేసి మాట్లాడారు. పనులు ఆపవద్దంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారంటూ ఏఈకి చెపుతున్న విషయాన్ని కార్పొరేటర్ విని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఏఈ నుంచి ఫోన్ తీసుకొని మంత్రిగారు చెబితే చెరువులను నాశనం చేస్తారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు కట్టకు ఆనుకొని ఎటువంటి రోడ్లు వేయకుండా కట్టడి చేయాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకరిస్తారా అని కార్పొరేటర్ ప్రశ్నించారు. అనంతరం పనులు ఆపాలని రియల్ ప్రతినిధులకు చెప్పారు. హైడ్రా పటాన్‌చెరు ప్రాంత ఏరియా సీఐ బాలగోపాల్ కార్పొరేటర్‌కు ఫోన్ చేశారు. గురువారం ఉదయం తమ బృందం వచ్చి బఫర్‌లో జరుగుతున్న అన్ని రకాల నిర్మాణాలు తొలగిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా మెట్టుకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే కలెక్టర్ ప్రావీణ్య, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, నీటిపారుదలశాఖ ఈఈ మల్లేష్‌లకు వినతిపత్రాలు అందజేమని తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రభుత్వం ఇస్తామన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య విధానాన్ని అందించే హెల్త్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయున్నీ కేటాయించకుండా జీవో 25 ప్రకారం సర్దుబాటు చేయడం సరికాదన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు ఉపాధ్యాయ సమస్యలను డీఈవో విజయకు వివరించారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరాలాల్, సంగయ్య, రాజేంద్రప్రసాద్, రమేష్, రజిత, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, విఠల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

చిన్నశంకరంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన గర్భిణిని 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. శాలిపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళలకు బుధవారం పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారమందించారు. వెంటనే అంబులెన్స్ సిబ్బంది చేరుకొని లక్ష్మీదేవిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 వాహనంలోనే మహిళ ప్రసవించింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం మెదక్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

శివంపేటలో ముగిసిన పీఎంశ్రీ స్పోర్ట్స్ మీట్

పుల్‌కల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట జిల్లా పరిషతు ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పీఎం శ్రీ స్పోర్ట్ మీట్ బుధవారం ముగిసింది. గత రెండు రోజులుగా పాఠశాలలో పీఎం శ్రీ స్పోర్ట్స్ మీట్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ క్రీడల్లో బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని హెచ్‌ఎం వేదశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాతం రాములు, వీరేశం, వాణిశ్రీ, సునీతావేణి, మాణిక్యం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



సిద్దాగౌడ్ (ఫైల్)

మెదక్ కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ సిద్దాగౌడ్ బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మరణించినట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సిద్దాగౌడ్ 2019 నుంచి 2024 వరకు రాయన్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మెదక్ మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంజాగౌడ్‌కు స్వయాన తమ్ముడు. ఆయన మృతి పట్ల మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాణిక్యరెడ్డి, మదన్ మోహన్ రావు, లావణ్య రెడ్డి, జమున జయరాంరెడ్డి, మాజీ ఎంపీపీ కొత్తపల్లి లక్ష్మీకిష్టయ్య, నవీన్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాణిక్యరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, లింగారెడ్డి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ట్రిబుల్ ఆర్ పరిహారం.. తొలివిడతతోనే సరిపెడతారా?

(5వ పేజీ తరువాయి)

ఈ నాలుగు గ్రామాల రైతులు, మిగతా హామీ ఇచ్చిన మొత్తమైన రెండో విడత కోసం ఎదురుచూస్తున్నారు. ఈ డబ్బులు రావాలంటే కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. దీంతో రైతులు కలెక్టర్ నిర్ణయం కోసం ఎన్నో ఆశలతో నిరీక్షిస్తున్నారు. ఈ నాలుగు గ్రామాల రైతులు నవంబరు 22న విచారణకు హాజరై, తమ గోడును వెలిబుచ్చి, రెండో విడత పరిహారాన్ని కూడా త్వరగా అందించాలని కోరారు. పరిహారం ఒకేసారి వస్తే మరోచోట భూమి కొనుగోలు చేసుకోవడానికైనా, కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడానికైనా ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

మిగతా 9 గ్రామాల ఎదురుచూపులు

డివిజన్‌లో మొత్తం 13 గ్రామాల నుంచి భూములు తీసుకుంటుండగా, ప్రస్తుతం నాలుగు గ్రామాలకే తొలి విడత పరిహారం అందింది. మిగతా తొమ్మిది గ్రామాల రైతులు తమకు తొలి విడత పరిహారం ఎప్పుడు అందుతుందోనని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, చిరువ్యాపారుల దుకాణాలు తొలగించకుండానే పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి, వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సిరావడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

అలసత్వంపై విమర్శలు

బైపాస్ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడానికి విద్యుత్, అటవీ శాఖల అధికారుల నిర్లక్ష్యమే కారణమని హెచ్ఎండీఏ అధికారులు చెబుతున్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, హైటెన్షన్ వైర్లతో పాటు చెట్లను తొలగించడంలో ఆయా శాఖల అధికారులు అలసత్వం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు కోసం హెచ్ఎండీఏ ద్వారా టీజీఎస్పీడీసీఎల్‌కు గత నెలలోనే డీడీ రూపంలో రూ.61,14,550 చెల్లించారు. అదే విధంగా 178 చెట్లను తొలగించేందుకు అటవీ శాఖకు రూ.97,900 చెల్లించినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. 33 కేవీ, 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు విద్యుత్ స్తంభాలు, చెట్లను తొలగించగానే రోడ్డు విస్తరణ పనులను కొనసాగిస్తామని హెచ్ఎండీఏ అధికార వర్గాలు స్పష్టం చేశాయి.